# ఈశావాస్య మిదం సర్వం

హరిప్రసాద్ కన్నెపల్లి: 98497 40560

"ఈశావాస్య మిదం సర్వం' అని ఆరంభమవుతుంది ఉపనిషత్తు. ప్రపంచమంతా ఈశ్వర చైతన్యంతోనే నిండి ఉంది — అని". "తేన త్యక్తేన భుంజీథా" అని మాటిమాటికి విమర్శించుకోవాలి. అలా విమర్శించుకుని ఏది త్యజించాలి? ఎంత త్యజించాలి? ఎలా త్యజించాలి? అని నిర్ధారణ చేసుకుని త్యజించటం వల్ల ఒక నిశ్చయాత్మక బుద్ధి కలుగుతుంది. అప్పుడు అటువంటి నిశ్చయాత్మక బుద్ధితో త్యజించినప్పుడు మనం మనల్ని సమాధాన పరుచుకోగలము. సమాధాన పరుచుకోకపోతే, ఆ తాపత్రయాలు ఇంకా బాధిస్తూనే ఉంటాయి. కాబట్టి తాపత్రయాలు తీర్చుకుని త్యజించటం ఉత్తమమని ఉపబోధ.

పైగా 'తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్యస్విద్ధనం' అన్నారు. అంటే ఆ త్యజించేది 'మా గృధః'కి సంబంధించిన విషయం. 'మా గృధః' అన్న పాఠంలో గురువులు చెప్పినదేమిటంటే, సాగరాలీదటానికి తాపత్రయ పడుతూ అలా దీర్ఘంగా రెక్కలు కట్టుకుని ఎగురుతున్న పక్షిలాగా కాక ఏ విషయం సునాయాసంగా, ఓపిగ్గా, విమర్శించి, వివరించుకుని, తాపత్రయ నివృత్తి చేసుకుని ఏది ఎంతమటుకు ఎలా వదిలి పెట్టాలో తెలుసుకుని నివృత్తి చేసుకోవాలి.

డబ్బులు, ధనం విషయం ప్రస్తావన ... ధనం మొత్తం వదలటానికి లేదు, ధనం జీవనాధారం. అనవసరంగా కల్పించుకున్న ఆశలను, ధనాశను వదలమని అర్థం. ధనమంటే నోట్లు, నాణేల విషయం కాక పరమార్థ సంపద అని అర్థం. ఆ ధనం ఎప్పుడూ జీవునికి సంబంధించి ఉంటుంది. 'ధనం మూల మిదం జగత్' అని కూడా చెప్పారు గదా ! లక్ష్మీ దేవిని చంద్రి, జగత్తుకి మూల కారణమని కూడా చెప్పారు కదా ! "మాత స్సమస్త జగతాం మధుకైటభారే - వక్షోవిహారిణి మనోహర దివ్యమూర్తే - శ్రీస్వామిని శ్రితజనప్రియ దానశీలే - శ్రీ వేంకటేశదయితే తవ సుప్రభాతం" అని శ్రీ వేంకటేశ్వరునికి సుప్రభాతం పాడతాం కదా ! కాబట్టి, టూకీగా, కొద్దిలో చెప్పాలంటే అంతా వదిలిపెట్టడానికి ఉండదు. మూలాన్ని, మూలతత్త్వాన్ని తెలుసుకుని, ఆత్మతత్త్వాన్ని తెలుసుకుని, ఆ ఆత్మతో ఏకీభావం చెందాలి. 'స్విద్ధనం ధనగ్ం స్విత్ స్విద్ధనం । ధనమితి ధనం ॥' విచక్షించుకుని, విమర్శించుకుని ...... వివిధాలలో సామ్యాన్ని (సామవేదం)

తెలుసుకుని, అవి పరస్పరం అవ్యయము, రెండుకాదు ఒకటే అని తెలుసుకుని, ధనమితి ధనమని నిరూపణతో ఆత్మతత్త్వంతో ఏకీభవించాలి .......

"తేన త్యక్తేన భుంజీథా" అంటే త్యజిస్తూ భుజించాలి, అంటే అంతా వదిలి పెట్టటానికి లేదు. యజ్ఞ కర్మలు నిర్వర్తించి, యజ్ఞశిష్టం భుజించమని వ్యాసులవారూ, భీష్ముడూ చెప్పారు. యజ్ఞాంతకృత్ యజ్ఞగుహ్యా మన్నమన్నాద ఏవచ - విష్ణు సహస్రం. భగవద్గీతలో 'కర్మణ్యే వాధికారస్తే మా ఫలేషు కదాచన - మా కర్మఫల హేతుర్భూ ర్మాతే సంగోస్త్వ కర్మణి' అన్నారు కదా ! ఫలాశ వదిలిపెట్టి కర్మలు సక్రమంగా నిర్వర్తించి అలా కలిగే ఫలితాన్ని, పరిణామాలకు వెరవకుండా ఆమోదించి, భుంజించవలసి ఉంటుంది అని చెప్పారు.